విదేశాంగ కార్యదర్శిగా విక్రమ్ మిస్రి

న్యూఢిల్లీ : తదుపరి విదేశాంగ కార్యదర్శిగా డిప్యూటీ జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ) విక్రమ్ మిస్రిని నియమించారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. 1989 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కి చెందిన మిస్రి నియామకం జులై 15 నుండి అమల్లోకి రానుంది. వినయ్ మోహన్ క్వాత్రా స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ఏడాది మార్చిలో ఆయనకు ఆరు మాసాల పొడిగింపును మంజూరు చేశారు. మంత్రివర్గ నియామకాల కమిటీ మిస్రి నియామకాన్ని ఆమోదించిందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ ఎన్ఎస్ఎగా మిస్రి కాలపరిమితి కుదింపును కూడా ఆమోదించారు.

ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో మందకొడిగా పోలింగ్

టెహరాన్ : ఇరాన్ అధ్యక్ష ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకే ముగియాల్సి ఉంది. అయితే పోలింగ్ మందకొడిగా సాగడంతో మరో రెండు గంటలపాటు అంటే రాత్రి 8గంటల వరకు పొడిగించారు. మొత్తం అర్హులైన ఓటర్లు 6.1 కోట్ల మందికి పైగా వున్నారు. 2021లో అధ్యక్షుడిగా ఎన్నికైన ఇబ్రహీం రైసి మే 19న హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోవడంతో ఈ ఎన్నికలు అవసరమయ్యాయి. పోలింగ్ ప్రారంభమైన కొద్ది నిముషాలకే ఇస్లాం మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేని తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థను కాపాడుకోవడానికి ఈ ఎన్నికల్లో పాల్గొనడం కీలకమని వ్యాఖ్యానించారు. ప్రధానంగా నలుగురు అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొంది. వీరిలో ప్రస్తుత పార్లమెంట్ స్పీకర్, అత్యున్నత జాతీయ భద్రతా మండలి సభ్యుడు, సిట్టింగ్ ఎంపి వున్నారు. టెహరాన్ మేయర్ మాజీ ఎంపి సహా ముగ్గురు అభ్యర్థులు బుధ, గురువారాల్లో తమ అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకున్నారు.

మహారాష్ట్ర తలసరి ఆదాయానికి గుజరాత్ గండి

- పరిశ్రమల తరలింపు ఎఫెక్ట్
- ఆరో స్థానంలో మహారాష్ట్ర, ఏడో స్థానంలో ఆంధ్రప్రదేశ్

ముంబయి : మహారాష్ట్ర ప్రజల తలసరి ఆదాయాల పెరుగుదలకు గుజరాత్ గండి కొడుతోంది. తలసరి ఆదాయాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. మహారాష్ట్ర ఆరో స్థానానికి పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో ఉంది. మహారాష్ట్ర ఎకనామిక్ సర్వే 2022-24 ప్రకారం.. తలసరి ఆదాయంలో రూ.3,11,649తో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. తర్వాత స్థానాల్లో రూ.3,04,474తో కర్ణాటక, రూ.2,96,592తో హర్యానా నిలిచాయి. తమిళనాడు రూ.2,75,583తో, గుజరాత్‌లో రూ.2,73,558గా ఉంది. మహారాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,52,389గా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్ రూ.2,19,881తో, ఉత్తరప్రదేశ్‌లో తలసరి ఆదాయం రూ.83,636గానే ఉండటం విశేషం. 2014లో మహారాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,25,260 కాగా, గుజరాత్‌ది రూ.1,13,139గా ఉంది. 2024 నాటికి మహారాష్ట్ర ఆదాయం రూ.2,52,389గా.. గుజరాత్‌లో తలసరి రూ.2,73,558కు పెరగడం విశేషం. "మహారాష్ట్ర కంటే గుజరాత్ ఎలా పుంజుకుందో ఈ సంఖ్యలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. పారిశ్రామిక నైపుణ్యానికి పేరు గాంచిన మహారాష్ట్ర తలసరి ఆదాయంలో ఒకప్పుడు స్థిరంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచింది. అయితే ఇటీవలి పలు పోకడలు ఇబ్బందికరమైన క్షీణతకు కారణమయ్యాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం లోపభూయిష్ట విధానాలు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మహారాష్ట్ర తలసరి ఆదాయంలో వెనుకబడి పోయింది." అని ఎన్‌సిపి(ఎస్‌పి) అధికార ప్రతినిధి మహేష్ తపసే అన్నారు. "ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా నేతృత్వంలో కీలక ప్రాజెక్టులు మహారాష్ట్ర నుండి గుజరాత్‌కు తరలించబడ్డాయి. అహ్మదాబాద్ గిఫ్ట్ నగరాన్ని ప్రత్యామ్నాయ ఆర్థిక కేంద్రంగా ప్రచారం చేస్తూ ముంబయి ప్రాముఖ్యతను తగ్గిస్తున్నారు. 2.5 లక్షల కోట్ల అప్పులతో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రంపై భారం మోపిందని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే విమర్శించారు. మహారాష్ట్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. దీంతో తలసరి ఆదాయంలో ఆరవ స్థానానికి పడిపోయిందన్నారు.

4న దేశవ్యాప్త బంద్

నీట్, యుజిసి నెట్ పేపర్ లీక్‌కు నిరసనగా ఎస్ఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నీట్, యుజిసి నెట్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ జులై 4న దేశవ్యాప్తంగా విద్యార్థులు బంద్ పాటించాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వికి సాను, మయూఖ్ బిశ్వాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో నీట్-పిజి పరీక్షను వాయిదా వేసిందని తెలిపారు. జూన్ 4న ప్రకటించిన నీట్-యుజి పరీక్ష ఫలితాలు పారదర్శకంగా లేవని, పేపర్ లీక్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. యుజిసి నెట్ పరీక్షను పేపర్ లీక్ కారణంగా రద్దు చేశారని తెలిపారు. దీంతో వచ్చే వారంలో షెడ్యూల్ చేసే సిఎస్ఐఆర్ నెట్‌ను ఎన్‌టిఎ వాయిదా వేసిందన్నారు. ఈ జాప్యంతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఫర్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇ) చివరి నిమిషంలో నీట్-పిజి ప్రవేశ పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు.

సియుఇటి, నీట్ వంటి కేంద్రీకృత పరీక్షలు విద్యను ప్రైవేటీకరించడాన్ని, కోచింగ్ సెంటర్ల సంస్కృతిని పెంపొందించడాన్ని ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. అట్టడుగు వర్గాలకు విద్య అందుబాటులో లేకుండా, భరించలేనిదిగా చేశారని దేశవ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థులు ఏళ్ల తరబడి ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. 'వన్ నేషన్, వన్ ఎగ్జామ్' ముసుగులో మొత్తం పరీక్షా వ్యవస్థ కుప్పకూలిందని, విద్యార్థుల విద్యా భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని విమర్శించారు.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ఎఎ) 25 మంది కంటే తక్కువ శాశ్వత సిబ్బందితో 25 పరీక్షలను నిర్వహిస్తుందని, అందువల్లే ఇలాంటి ఘటనలు ఉత్పన్నం అవుతున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితిని గుర్తించకుండా, కొంతమంది వ్యక్తులపై నిందలు మోపుతున్నారని, కేంద్ర విద్యాశాఖ బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్‌టిఎ, విద్యా మంత్రిత్వశాఖ వైఫల్యానికి పూర్తిగా అసమర్థులైన ఆర్ఎస్ఎస్ సభ్యులతో పని చేయడమే కారణమని విమర్శించారు.

నీట్, యుజిసి నెట్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్)

ఉన్నత విద్యలో మాత్రమే కాకుండా, పాఠశాల విద్య పరిస్థితి దారుణంగా ఉందన్నారు. బిజెపి పాలనలో గత దశాబ్ద కాలంలో సంబంధిత శాఖలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గడం, ఉపాధ్యాయుల కొరత, స్థూల నమోదు నిష్పత్తి తగ్గాయని పేర్కొన్నారు. '2018-19, 2021-22 మధ్య దేశంలో మొత్తం పాఠశాలల సంఖ్య 15,51,000 నుండి 14,89,115కు తగ్గాయి. 61,885 పాఠశాలలు మూసివేశారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గుదల, మరోవైపు ప్రైవేటు పాఠశాలల సంఖ్య పెరుగుదల జరుగుతుంది. ఇది అట్టడుగు వర్గాలకు పెద్ద ప్రశ్నగా మారింది' అని అన్నారు. ఈ పరిస్థితిలో దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ జులై 4న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. విద్యార్థులు తరగతులను బహిష్కరిస్తారని, ప్రతి రాష్ట్రం, దేశ రాజధానిలో మార్చ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ బంద్‌లో విద్యార్థి లోకం పాల్గొనాలని పిలుపునిచ్చారు.

డిమాండ్లు ఇవే..

- ఎన్‌టిఎ వ్యవస్థను రద్దు చేయాలి
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి, నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి.
- పిహెచ్‌డి అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి
- ఇప్పటికే ఉన్న అడ్మిషన్ విధానాలను కేంద్రీకృత ప్రవేశ పరీక్షలతో భర్తీ చేసే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలి
- టిఐఎస్ఎస్ ముంబయి, ఐఐటి ముంబయి నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు - విద్యార్థి సంఘ నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు, యూనివర్సిటీల్లో స్వేచ్ఛా వ్యక్తీకరణ, ప్రజాస్వామ్య అణచివేత చర్యలను ఆపాలి
- పాఠశాలల మూసివేతను ఆపాలి

వివాదం నేపథ్యంలో నీట్‌ను రద్దు చేయాలని తీర్మానం చేస్తున్న సభ్యులు

నీట్‌ను రద్దు చేయాల్సిందే!

- తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం ఆమోదం

చెన్నై : నీట్ -2024 పరీక్షలో పెద్దయెత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఈ జాతీయ స్థాయి వైద్య విద్య ప్రవేశ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని, దాని స్థానంలో గతంలో మాదిరిగా 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య విద్యలో ప్రవేశం కల్పించే విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ శుక్రవారం ఏకగ్రీవంగా ఓ తీర్మానాన్ని ఆమోదించింది. తమిళనాడు మొదటినుండి నీట్‌ను గట్టిగా వ్యతిరేకిస్తూ వస్తోంది. నీట్ నుంచి తమిళనాడును మినహాయిస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నరు తొక్కిపట్టారు. జాతీయ స్థాయిలో నీట్‌ను రద్దు చేసేందుకు గానూ జాతీయ మెడికల్ కమిషన్ చట్టానికి అవసరమైన సవరణలు చేయాలని ఆ తీర్మానం సూచించింది. బిజెపి ఎంఎల్ఎలు సభ నుండి వాకౌట్ చేయగా, డిఎంకె మిత్రపక్షాలైన కాంగ్రెస్, విసికె, సిపిఐ, సిపిఎం, ఎండిఎంకె, ఎంఎల్ఎలు టి.వేలుమురుగన్, ఎంహెచ్.జవహరుల్లా, మనోజ్ పి.పాండ్యన్, బిజెపి మిత్రపక్షం పిఎంకెలు తీర్మానానికి మద్దతు తెలిపాయి. తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడారు. 12వ తరగతిలో సంపాదించిన మార్కుల ప్రాతిపదికగా అడ్మిషన్ వ్యవస్థ వుంటే సామాజిక న్యాయానికి, విద్యార్థులకు సమాన అవకాశాలకు హామీ కల్పించబడుతుందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు ఇందులోవుంటారన్నారు. తద్వారా డాక్టర్లు కూడా అన్ని ప్రాంతాలకు, వర్గాలకు చెందినవార వుంటారని అన్నారు. కానీ నీట్ నిర్వహణలో అనేక అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకున్నాయి. అనూహ్యంగా అనేకమంది విద్యార్థులకు పూర్తి మార్కులు వచ్చాయి. లేటయిందనే కారణంతో గ్రేస్ మార్కులు కలిపారు. ఏక్కడా నిబంధనలను పాటించలేదని అన్నారు. వివిధ కేంద్రాల్లో పరీక్షకు ముందు ప్రశ్నా పత్రం లీకయినట్లు వార్తలు వచ్చాయన్నారు. నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ఒక్కటే పోరాడుతోందన్నారు. నీట్ వల్ల తలెత్తుతున్న సమస్యలను గ్రహించి వివిధ రాష్ట్రాల్లో నీట్ పట్ల విముఖత పెరుగుతోందన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దీనిపై ప్రధానికి ఒక లేఖ కూడా రాశారని గుర్తుచేశారు. మొత్తంగా నీట్‌ను వ్యతిరేకించడంలో తమిళనాడులో ఏకగ్రీవ అభిప్రాయం నెలకొందని తెలిపారు.

కర్ణాటకలో ఘోరం

- ట్రక్‌ను ఢీకొన్న మినీ బస్ : 13మంది మృతి

బెంగళూరు : నిలిచి ఉన్న ట్రక్‌ను వెనకు నుంచి ఒక మినీ బస్ ఢీకొన్న ప్రమాదంలో 13 మంది మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం శుక్రవారం తెల్లవారు జామున 3:45 గంటలకు కర్ణాటకలో జరిగింది. హవేరి జిల్లాలో పూణే-బెంగళూరు జాతీయ రహదారిపై గుండెనహల్లి క్రాసింగ్‌కు సమీపంలో ఈ ప్రమాదం జరగ్గా, ఈ సమయంలో మినీ బస్సులో 17 మంది ఉన్నారు. వీరంతా శివమొగ్గ జిల్లాకు చెందిన వారు. బెల్గావి జిల్లాలోని ఒక ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన నలుగురిని సమీప ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తే ఈ ప్రమాదానికి దారితీసి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. హవేరి జిల్లా ఎస్పి అన్ను కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ బాధితులంతా చించోలి మాయమ్మ దేవస్థానాన్ని దర్శించుకుని శివమొగ్గ జిల్లాలోని స్వగ్రామం యెమెహత్తికి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు.

వ్యవస్థ వైఫల్యాలపై దృష్టేదీ?

- రైలు ప్రమాదాలకు సర్కారు తీరే కారణం
- పీపుల్స్ కమిషన్ వెల్లడి

న్యూఢిల్లీ : వ్యవస్థ వైఫల్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడమే ఇటీవలి రైలు ప్రమాదాలకు కారణమని ప్రభుత్వరంగ సర్వీసులపై పీపుల్స్ కమిషన్ విమర్శించింది. భారతీయ రైల్వేస్‌లో లోకో పైలట్లపై పనిభారం ఎక్కువగా ఉందని విమర్శించింది. ప్రముఖ విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, పూర్వపు అడ్మినిస్ట్రేటర్లు, కార్మిక యూనియన్ నేతలు, సామాజిక కార్యకర్తలు ఈ పీపుల్స్ కమిషన్‌లో వున్నారు. ఐదు కీలకమైన వ్యవస్థ వైఫల్యాలను పేర్కొంటూ వీటిని నిర్లక్ష్యం చేశారని, దీనివల్ల రైలు ప్రయాణికులు, సరుకు రవాణా భద్రతపై ప్రభావం చూపిస్తోందని ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిల్లో సిగ్నల్ వైఫల్యమవడం అన్నింటికంటే టాప్‌లో వుందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో అనుసరించాల్సిన ప్రక్రియలు, పద్ధతులపై రైల్వే సిబ్బందిలో స్పష్టత కొరవడిందన్నారు. అత్యంత అమానవీయమైన పరిస్థితుల్లో లోకో పైలట్లు పనిచేస్తున్నారని విమర్శించింది. భద్రతా కేటగిరీలో పెద్ద సంఖ్యలో ఖాళీలున్నా వాటిని భర్తీ చేయడం లేదన్నారు.

పైగా ఏ ప్రమాదం జరిగినా దానికి బాధ్యత, కారణం లోకో పైలట్లు, స్టేషన్ మేనేజర్లు, సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్, పాయింట్స్‌మన్‌ను తప్పుబడతారని, ఈ ధోరణి రైల్వే అధికారుల్లో బాగా పెరిగిందని ఆ ప్రకటన పేర్కొంది. ఇది కూడా ఒక రకమైన వ్యవస్థ వైఫల్యమేనని వ్యాఖ్యానించింది. రైళ్ల ఢీకొనకుండా నివారించే యాంటీ కొలిజన్ వ్యవస్థ అయిన కవచ్‌ను రూపొందించడంలో అసాధారణ జాప్యం జరుగుతోందని విమర్శించింది. పైగా ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఉన్నతాధికారులు బాధ్యతలు తీసుకోవడానికి బదులుగా కార్మికులను నిందిస్తూ వారిని బలి చేస్తున్నారని పేర్కొంది.

ఈ చర్యలు తీసుకోండి

తగినన్ని నిధులు కేటాయించడం ద్వారా సిగ్నల్ వ్యవస్థను ఆధునీకరించాలని కమిషన్ కేంద్రాన్ని కోరింది. కొత్త పరికరాలపై క్రమం తప్పకుండా రైల్వేసిబ్బంది అందరికీ శిక్షణ ఇవ్వడం తప్పనిసరి చేయాలని కోరింది. ఈ అంశాలను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించాలని రైల్వే బోర్డును, రైల్వే మంత్రిత్వ శాఖను కమిషన్ కోరింది. లోకోపైలట్ల పనిగంటలను తగ్గించాలని సూచించింది.

ఇజ్రాయిల్ ఆంక్షలతో గాజాలో ఆకలి మంటలు

గాజా : గత తొమ్మిది మాసాలుగా గాజాపై దాడులు కొనసాగిస్తూ, ఆహారం, ఇతర నిత్యావసరాలను ప్రజలకు అందకుండా ఇజ్రాయిల్ ఆంక్షలు కొనసాగిస్తుండడంతో లక్షలాది మంది పాలస్తీనీయులు ఆకలి మంటలతో మలమలలాడుతున్నారు. పోషకాహార లోపం తీవ్రస్థాయిలో వెంటాడుతోంది. రఫా నగరంపై పదాతిదళం దాడులు ప్రారంభించడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మే 6న ప్రారంభమైన ఈ భూత దాడులతో పది లక్షలమందికి పైగా ప్రజలు రఫాలోని తమ సొంత నివాసాల నుంచి బలవంతంగా తరమివేయబడ్డారు. మానవతా సాయం సరఫరాలను ఇజ్రాయిల్ అడ్డుకుంటోంది. ఈ దాడులకు ముందు గాజా జనాభాలో దాదాపు సగంమంది రఫాలోనే తలదాచుకున్నారు. కానీ రఫాలో ఊచకోతతో ప్రజలకు ఆహారం అందక 5లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు కరువు కోరల్లో చిక్కుకున్నారని ఐక్యరాజ్య సమితి నిపుణుల బృందం ఆందోళన వ్యక్తం చేసింది. పదాతి దాడుల భయంతో అంతర్జాతీయ సంస్థలు మానవతా సాయాన్ని నిలిపివేశాయి. ఇప్పటికే చేరిన సరఫరాలు కూడా దాడుల భయంతో ప్రజలకు అందే పరిస్థితులు కనిపించడం లేదు. ఆకలి బాధను పడలేక దాడుల భయాన్ని కూడా పక్కనబెట్టి ఆహారం కోసం క్యూల్లో నిలుచున్నవారినీ మిలటరీ వదిలిపెట్టలేదు. రఫాలో దాడులు ప్రారంభమైన తర్వాత ప్రధాన ఆహార సరఫరాల క్రాసింగ్‌లను ఇజ్రాయిల్ మూసివేసింది. పలు ఆంక్షలను విధించింది. రాబోయే మాసాల్లో కరువు మరింత పెచ్చరిల్లే ప్రమాదం వుందని ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపిసి) తాజా విశ్లేషణలో వెల్లడైంది.

గాజాలో మానవతా సాయాన్ని పంపిణీ చేసే సహాయక సిబ్బందిని కూడా లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతుందోంటూ ఐక్యరాజ్య సమితి ఘాటుగా విమర్శించింది. ఇజ్రాయిల్ ఆర్మీ కార్యకలాపాలను లేని చోట్ల కూడా సహాయక సిబ్బందిపై దాడి చేసి, కాల్పులు జరిపి హతమారుస్తున్నారని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ మంగళవారం వ్యాఖ్యానించారు. ఉద్దేశ్యపూర్వకంగానే ఇలా ప్రజలు కరువు వాతన బడేలా చేయడం యుద్ధ నేరాల కిందకు వస్తుందని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి విమర్శించారు. ఇజ్రాయిల్ విధించిన ఆంక్షల కారణంగా గాజా ప్రజల్లో మెజారిటీ భాగం అంతర్జాతీయ సాయంపైనే ఆధారపడి వున్నారు. పశ్చిమ దేశాలు ప్రతీసారి ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తూ ప్రకటనలు చేయడానికే పరిమితమయ్యాయి తప్ప ఎలాంటి ఆచరణాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నాయి. పాలస్తీనియన్లకు అండగా వుంటామని ప్రకటించిన అరబ్ దేశాలు కూడా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి.

విపత్తుల పట్ల అప్రమత్తం

- హోంమంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తుపాను, భారీ వర్షాలు, పిడుగుల పట్ల అప్రమత్తంగా వుండాలని అధికారులను హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయానికి మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం వెళ్లారు. కార్యాలయంలోని ఎమర్జెన్సీ అలర్ట్ కేంద్రాన్ని సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు.

నీట్ స్కామ్‌పై చర్చ జరపాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

నీట్ విద్యార్థుల గొంతు నొక్కడమేనని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సభ్యుల మైక్రో ఫోన్‌ను తాను నియంత్రించ లేదని స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. నీట్ వ్యవహారంలో ప్రభుత్వ తీరును కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ తప్పుపట్టారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్‌తో లక్షలాది విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రతిపక్ష ఇండియా ఫోరం సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారని, తాను క్రిమినల్ చట్టాల అమలు నిలిపివేయాలని కోరుతూ నోటీస్ ఇచ్చానని మనీష్ తివారీ పేర్కొన్నారు. వీటిపై చర్చ జరగకపోవడం విచారకరమని ఆయన అన్నారు. ఇక దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజ్‌తో యువత భవిష్యత్ నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపి దీపిందర్ సింగ్ హుడా ఆందోళన వ్యక్తం చేశారు.

స్పృహతప్పిపడిపోయిన కాంగ్రెస్ ఎంపి

నీట్ పరీక్షలో అవకతవకలపై ప్రతిపక్షాలు సభలో నిరసన తెలుపుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఛత్తీస్‌గఢ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ సభ్యులు ఫూలో దేవి నేతమ్ శుక్రవారం ఉదయం స్పృహతప్పి పడిపోయారు. ఆమెను వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం. 2/డిఓ/2024-25, తేదీ: 27.06.2024
అమలాపురంలో నెలవారీ అద్దె స్థావరాలపై (01-04-2024 నుండి 31.03.2025 వరకు) అద్దె వాహనాలను నిమగ్నం చేయడానికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ షెల్‌ఫారమ్ కింద ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. అంచనా విలువ : రూ. 4.20 లక్షలు. టెండర్లు స్వీకరణకు చివరి తేదీ: 10.07.2024న మ.2.30 గం.ల వరకు. వివరములకు www.apeprocurement.gov.in ఫోన్. 9440818052 సంప్రదించవలెను
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు
(ఆర్ అండ్ బి), అమలాపురం
DIPRNo:13618/CL/ADVT/1/1/2021-22

నీట మునిగిన ఢిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. గురువారం నుంచి కురుస్తున్న వర్షాలతో ఢిల్లీ వాతావరణం చల్లబడింది. గత రెండు నెలల నుంచి ఢిల్లీలో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం మాత్రం కనిష్ట ఉష్ణోగ్రత 24.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.భారీ వర్షాలతో ఢిల్లీ రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాధారణ ప్రజలే కాదు.. ఎంపీలు సైతం ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై నీరు నిలిచి ఉండడంతో ఎస్‌పి ఎంపి రామ్‌గోపాల్ యాదవ్ పార్లమెంటుకు వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. ఆయనను సిబ్బంది చేతుల్లో మోసి కారులో కూర్చోబెట్టారు. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై ఎంపి రామ్‌గోపాల్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. రోడ్డుపై నిలిచిన వర్షం నీటిని మోటార్ ద్వారా తొలగించి ఉంటే బాగుండేదని, ఢిల్లీ అధికారులతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయిందన్నారు. తనతోపాటు హోమ్‌శాఖ సహాయ మంత్రి, ఆర్మీ జనరల్స్, నేవీ అడ్మిరల్స్ బంగ్లాలు కూడా జల దిగ్బంధంలో చిక్కుకున్నాయని చెప్పారు. ట్రాఫిక్ జామ్‌లతో పాటు చాలా కాలనీల్లో విద్యుత్, మంచినీటి సరఫరా నిలిచిపోయింది. మింటో రోడ్డులో ఒక ట్రక్కు పూర్తిగా నీట మునిగింది. విద్యుత్ షాక్‌తో రోహిణి ప్రాంతంలో 39 ఏళ్ల వ్యక్తి మరణించాడు.

విమానాశ్రయ టెర్మినల్ కూలి ఒకరు మృతి

భారీ వర్షాల కారణంగా ఢిల్లీ విమానాశ్రయం టెర్మినల్-1 పై కప్పు కూలిపోయింది. శుక్రవారం ఉదయం 5:00 గంటల సమయంలో డిపార్చర్ గేట్ 1, గేట్ 2 వద్ద టెర్మినల్ 1 పై కప్పు కూలిపోవడంతో ఈ ప్రమాదంలో ఒక క్యాబ్ డ్రైవర్ మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని మేదాంత ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో నాలుగు వాహనాలు దెబ్బతిన్నాయి. వీటిలో ఒక కారు నుంచి ఒకరిని రక్షించారు. ఈ ప్రమాదంతో టెర్మినల్ 1ను పూర్తిగా ఖాళీ చేసి మూసివేశారు. ప్రమాద ప్రాంతాన్ని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు, గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేయడానికి సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ విమానాశ్రయ అధికారులు ప్రకటించారు. టెర్మినల్ 1 డిపార్చర్ హాల్‌ను విస్తరణ పనుల తరువాత ఈ ఏడాది మార్చిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు.

విమాన సర్వీసులు రద్దు

టెర్మినల్ 1 పై కప్పు కూలడం, భారీ వర్షాల కారణంగా అనేక విమాన సర్వీసులను శుక్ర, శనివారాల్లో రద్దు చేశారు. కొన్ని సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. తమ విమాన సర్వీసులను నిర్ధారణ చేసుకున్న తరువాతే వినియోగదారులు విమానాశ్రయానికి రావాలని ఇండిగో తదితర సంస్థలు ప్రయ